ఎండలోనే పార్కింగ్ చేసి ఉన్న స్వచ్ఛ సర్వేక్షణ్ పారిశుధ్య వాహనాలు.

ఎండకు ఎండుతూ...వానకు తడుస్తూ

- రామగుండం బల్దియాలో సిబ్బంది వాహనాలకు రక్షణ కరువు
- దుమ్ము, ధూళి పట్టినా పట్టించుకునే వారేరి

కోల్‌సిటీ, ఏప్రిల్ 13: జిల్లాలోనే ఏకైక కార్పొరేషన్ రామగుండం. ఇది. చూడటానికి అద్దాల మేడగా ఉన్నా... లోపల సిబ్బంది వాహనాలకు కనీసం పార్కింగ్ షెడ్డు కూడా లేని దుస్థితి. కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధించి వాహనాలు ఎండలోనే పార్కింగ్ చేయాల్సి వస్తుంది. ఇక పారిశుధ్య వాహనాలది కూడా అదే దుస్థితి. రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన వాహనాలు సైతం ఎండలోనే మగ్గుతున్నాయి. వర్షానికి తడుస్తూ... ఎండకు ఎండుతున్నాయి. పార్కింగ్ షెడ్ లేక ఎక్కడ పడితే అక్కడ చెట్ల కింద, లేదంటే ఎండలోనే వాహనాలు పార్కింగ్ చేసి ఉంచడంతో గతంలో వాహనాల బ్యాటరీలు కూడా మాయమైన సంఘటనలు ఉన్నాయి. ఉదయం చెత్త సేకరణకు వెళ్లిన పారిశుధ్య వాహనాలు మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యాలయంకు చేరుకుంటాయి. తర్వాత ఎండలోనే పార్కింగ్ చేసి ఉంచడంతో మరుసటి రోజు వరకు దుమ్ము,ధూళి పట్టి కొనుగోలు చేసిన కొద్ది రోజుల్లోనే పాడైపోతున్నట్లు సిబ్బంది వాపోతున్నారు. సిబ్బంది, ఇతర కార్మికులకు సంబంధించిన వాహనాలతోపాటు వివిధ అవసరాలు, పన్నులు చెల్లించేందుకు వచ్చే వినియోగదారుల వాహనాలు కూడా ఎండలోనే పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి ఉంది. అధికారులకు సంబంధించిన వాహనాలు మాత్రం కార్యాలయం వెనుకాల గల చెట్ల కింద నీడన, రేకుల షెడ్ కింద పార్కింగ్ చేసి ఉంటాయి. ఈ వ్యత్యాసంతో సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ వాహనాలకు కనీస రక్షణ, నీడ లేకున్నా పట్టించుకోవడం లేదని బాహాటంగానే విమర్శిస్తున్నారు. బల్దియా కమిషనర్ జోక్యం చేసుకొని వాహనాల పార్కింగ్ కోసం షెడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

రైతు భరోసా ఏదీ?

పెద్దపల్లి, ఏప్రిల్13: కాంగ్రెస్ సర్కారు వానకాలం రైతు భరోసాకు ఎగనామం పెట్టింది. ఎట్టకేలకు యాసంగి పంటకు సంబంధించి గత నెలాఖరు వరకు రైతు భరోసా ఇస్తామని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వరరావు ప్రకటించారు. యాసంగి పంట చేతికచ్చిన రైతు భరోసా మాత్రం రైతులందరికీ అందలేదు.పెట్టుబడి సాయం కోసం అన్నదాతలు ఎదురు చుస్తున్నారు. జిల్లాలో 1,61, 032 రైతులకు గాను, రూ. 165, 50, 47, 119 చెల్లించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 1, 21, 698 రైతుల ఖాతాల్లో రూ. 88, 86, 66, 72 జమ చేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతును రాజు చేయాలనే సంకల్పంతో రైతు బంధు పథకం శ్రీకారం చూట్టి పంట పెట్టుబడి సాయం ఎకరానికి రూ. 5వేల చొప్పున వానకాలం, యాసంగి సీజన్ ముందు రైతుల ఖాతాలో జమ చేసింది. దీనికి తోడు సాగు నీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంది. అయితే ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే రైతు భరోసా కింద ఎకరాకు రూ. 15వేలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ నమ్మబలికింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 16 నెలలు దాటినా రైతులందరికీ సకాలంలో పెట్టుబడి సాయం అందించిన దాఖలాలు లేవు. 2024 వానకాలానికి ఎగనామం పెట్టి, ఎట్టకేలకు యాసంగి సీజన్ సంబంధించి ఎకరాకు రూ. 6వేలు ఇస్తామని జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు కేవలం మూడెకరాల వరకే రైతు భరో సా వేయడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి.

భరోసా కొందరికేనా?

రైతు భరోసా కొంత మంది రైతులకు మాత్రమే అందించి కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసినట్లు కనిపిస్తున్నది. రైతుందరికీ ఇస్తారా? లేదా? అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వం వానకాలం, యాసంగి సీజన్ ముందే రోజుకో ఎకరం చొప్పున పెంచుకుంటూ 15 -20 రోజుల మధ్య పూర్తి చేసేది. పెట్టుబడి సాయం సకాలంలో అందడంతో అప్పులు చేయాల్సిన అవసరం వచ్చేది కాదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడి సాయానికి ఎగనామం పెట్టడటంతో అప్పులు చేయక తప్పటం లేదని అన్నదాతలు అవేదన చెందుతున్నారు.

ఆపిల్ కిడ్స్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే

కమాన్‌పూర్, ఏప్రిల్ 13: మండల కేంద్రంలోని ఆపిల్ కిడ్స్ పాఠశాలలో 11వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు.విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. యూకేజీ పూర్తి చేసుకొని ఒకటో తరగతిలోకి ప్రవేశిస్తున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. యూట్యూబ్ స్టార్, ఫోక్ డాన్సర్ వర్షిణి హాజరై చిన్నారులకు బహుమతులు అందజేశారు. వర్షిణిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మచ్చ రాము, కరస్పాండెంట్ వెంకటరెడ్డి, ట్రస్మా జిల్లా కోశాధికారి ఓదెలు, దేవి లక్ష్మీ నర్సయ్య, పడాల యాదగిరి, జంగపల్లి అజయ్, ప్రిన్సిపాల్ రాజమణి, భూలక్ష్మీ, గౌతమి, చామంతి, స్రవంతి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మూడు గేదెలు మృతి

రామగిరి, ఏప్రిల్ 13: పెద్దపేట గ్రామంలో విద్యుత్ షాక్‌తో శనివారం సాయంత్రం మూడు గేదెలు మృతి చెందాయి. పెద్దంపేటకు చెందిన రామగిరి నర్సయ్య గ్రామ పంచాయతీ సిబ్బందిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇతని గేదెలు రోజువారిలాగానే గ్రామ పరిసరాల్లో మేతకు వెళ్లాయి. 11 కేవీ లైన పోలు వైఉరకు విద్యుత్ సరఫరా అయి మూడు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. దాదాపు ఒక్కొక్క గేదె విలువ సుమారు రూ.60వేలు ఉంటుందనీ, మూడు గేదెలకు కలిపి రూ.లక్షా 80వేల వరకు ఉంటుందని బాధితుడు నర్సయ్య కన్నీటి పర్యంతమయ్యాడు. తక్షణమే విద్యుత్ అధికారులు అంచనా వేసి బాధితుడికి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని మాజీ సర్పంచ్ చింతపట్ల నాగరాజు కోరారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

మంథని : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- కొనుగోలు కేంద్రాల ప్రారంభం

మంథని, ఏప్రిల్ 13: రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి శ్రీధర్ బాబు సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రిని పీఏసీఎస్ చైర్మన్‌తో పాటు పాలక వర్గ సభ్యులు సన్మానించారు. అనంతరం మాజీ స్పీకర్ శ్రీపాద రావు 26వ వర్ధంతి సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు, రామగుండం అంబర్ కిషోర్ ఝూలతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు శ్రీపాదరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో విండో ఉపాధ్యక్షుడు బెల్లంకొండ ప్రకాశ్ రెడ్డి, డైరెక్టర్లు ఆకుల రాజబాబు, రావి కంటి సతీశ్ కుమార్, సిరిమూర్తి ఓదెలు, లెక్కల కిషన్‌రెడ్డి, కొత్త శ్రీనివాస్, దాసరి లక్ష్మి, ఉడుత మాధవి-పర్వతాల్ యాదవ్, సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ నరేశ్, ఏఎంసీ సెక్రటరీ సతీశ్ కుమార్, సీఈవో మామిడాల అశోక్ కుమార్ పాల్గొన్నారు.

రామగిరి, ఏప్రిల్ 13: మాజీ స్పీకర్ శ్రీపాద రావు 26వ వర్ధంతిని పురస్కరించుకొని రామయ్యపల్లె బస్‌స్టేజీ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి శ్రీధర్ బాబు హాజరయ్యారు. శ్రీపాద రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. .

కమాన్‌పూర్,ఏప్రిల్ 13: జూలపల్లిలోని ఆదర్శనగర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. అంతకుముందు మండల కేంద్రంలో మాజీస్పీకర్ శ్రీపాద రావు విగ్రహానికి మంత్రి శ్రీధర్‌బాబు తన తనయుడితో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామ పంచాయతీ సపాయి కార్మికులకు, కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులకు, నాయకులకు షీల్డుల బహుకరణలో పాల్గొని అందజేశారు. అ తన తండ్రి పేరు మీద నిరుపేదలకు అన్నదానం చేశారు.

సమస్యల వలయంలో వడ్కాపూర్

వడ్కాపూర్-ధూళికట్ట గ్రామాల మధ్య దెబ్బతిన్న లో లెవల్ వంతెన

- పగుళ్లు పడిన సీసీరోడ్లు
- కంపు కొడుతున్న పరిసరాలు
- మురికి కూపంగా పాత బావి
- వంతెనలు లేక అవస్థలు

వడ్కాపూర్‌లో పగుళ్లు పడిన సీసీరోడ్డు

జూలపల్లి, ఏప్రిల్ 13 : మండలంలోని వడ్కాపూర్ గ్రామం సమస్యల వలయంలో చిక్కుకుని విలవిలలాడుతున్నది. దశాబ్దాల తరబడి అభివృద్ధికి నోచుకోక గ్రామస్తులు అరిగోస పడుతున్నారు. ఎక్కడి సమస్యలు అక్కడ తిష్టివేసి పాలకుల నిర్లక్ష్యాన్ని వెక్కిరిస్తున్నాయి. వాగు, ఒర్రెలపై దెబ్బతిన్న వంతెనలు, ఇరుకైన గల్లీలు, గుంతలు, పగుళ్లు పడిన అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. మురుగు నీటి కాల్వల నిర్వహణ లోపం తోపాటు, పాడుపడిన పాత వ్యవసాయ బావులు మురికి కూపంగా మారాయి. ఏండ్ల తరబడి ఇక్కడి పరిసరాలు కంపుకొడుతుండగా ప్రజలు సతమతమవుతున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాత భవనం ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఐకేపీ గ్రామైక్య సంఘాలకు సొంత భవనం లేక అద్దె ఇంట్లో సమావేశాలు నిర్వహించుకుంటున్నారు. స్థానికంగా సింగిల్ విండో గోదాం నిర్మించకపోవడంతో ఎరువుల కోసం రైతులు చాలా దూరం వెళ్లాల్సివస్తోంది.

వడ్కాపూర్‌లో దాదాపు 5 వేల దాకా జనాభా ఉండగా, 12 వార్డులున్నాయి. ఏ గల్లీ చూసినా దెబ్బతిన్న సీసీరోడ్లు దర్శనమిస్తాయి. సీసీరోడ్లు కంకర తేలి, నెర్రెలు, పగుళ్లు పడిన రోడ్లపై వాహనాలు అదుపు తప్పుతున్నాయి. రహదారుల మరమ్మతులు చేపట్టడంలేదు. ఇరుకు గల్లీల్లో ఎదురెదురుగా వచ్చే వాహనాలు వెనక్కి వెళ్లడం తప్పడం లేదు. మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు గమనించకపోతే ప్రమాదాల బారిన పడడం తప్పదు.

వంతెనలు కరువు

వానకాలంలో వడ్కాపూర్ గ్రామస్తులు యేటా జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నారు. మూడు వైపులా వాగు, ఒర్రెలపై వంతెనలు పుననిర్మించకపోవడం శాపంగా మారింది. వడ్కాపూర్-ధూళికట్ట (ఎలిగేడు మండలం) గ్రామాల మధ్య హుస్సేనిమియా వాగుపై వంతెన పూర్తిగా దెబ్బతిన్నది. చిన్నపాటి వర్షాలకు వరదనీటి ప్రవాహం అధికమై రాకపోకలు స్థంభించి పోతున్నాయి. వడ్కాపూర్-కీచులాటపల్లి, వడ్కాపూర్-జూలపల్లి గ్రామాల మధ్య ఒర్రెలపై లో లెవల్ కల్వర్టులు దాటలేక ప్రయాణాలు వాయిదా వేసుకుంటున్నారు.

మురికికూపంగా పాతబావి

జనావాసాల మధ్య పాడుపడ్డ వ్యవసాయ బావి మురికికూపంగా మారుతోంది. వానకాలంలో వరదనీరు చేరి దుర్వాసన వస్తోంది. పరిసర ప్రాంతాల ప్రజలు కంపు భరించలేక అవస్థలు పడుతున్నారు. ముళ్లపొదలు, చెత్తా చెదారం, పిచ్చిమొక్కలతో నిండి అపరిశుభ్రతకు నిలయంగా నిలిచింది. ఊరిలోని నీరంతా బావిలో చేరి విష పురుగుల, ఈగలు, దోమల బెడదతో వ్యాధులతో బాధ పడుతూ దవాఖాన పాలవుతున్నారు. పాడుపడ్డ బావి పూడ్చివేయాలని అధికారులకు చాలాసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి సొంత స్థలం అందుబాటులో లేక రైతుల పంట పాలాల్లో స్థలాలు అద్దెకు తీసుకుంటున్నారు.

బౌద్ధ స్తూపానికి దారి కరువు

వడ్కాపూర్ శివారులో శాతవాహనుల కాలంనాటి బౌద్ధస్తూపం అభివృద్ధికి నోచుకోవడం లేదు. చారిత్రక సంపద ఉనికి ప్రశ్నార్థంగా మారి ఆనవాళ్లు లేకుండా పోతుందేమోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. 751, 752 సర్వే నంబర్‌లోని 9 ఎకరాల 18 గుంటల ప్రభుత్వ స్థలంలో పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దుతామని పాలకులు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదు. తాగునీరు, నీడ, విద్యుత్ సౌకర్యాలు కరువై నిర్లక్ష్యపు నీడ ఆవరిస్తోంది. అక్కడక్కడా ఒర్రెలపై వంతెనలు లేక నీటి నుంచి దాటలేక పోతున్నారు. తారు రోడ్డు నుంచి బౌద్ధస్తూపం దాకా వెళ్లడానికి గతంలో నిర్మించిన 3 కిలోమీటర్ల మట్టిరోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డుపై వర్షాకాలంలో కనీసం నడిచి వెళ్లే పరిస్థితి లేదు. రైతులు పంట ఉత్పత్తులు, ఎరువులు తరలించుకోడానికి రైతులు, బౌద్ధస్తూపం సందర్శకులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్యలు తీర్చాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

ఉల్లాసంగా.... ఉత్సాహంగా...

- ఆసక్తిగా సాగిన స్నేహపూర్వక క్రికెట్ పోటీలు

విజయం సాధించిన సింగరేణి జట్టు

రామగిరి, ఏప్రిల్ 13: గోదావరిఖనికి చెందిన వైద్యులు, సింగరేణి అధికారుల మధ్య స్నేహ పూర్వక క్రికెట్ పోటీలు ఉల్లాసంగా...ఉత్సాహంగా సాగాయి. స్థానిక జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఆదివారం గోదావరిఖనికి చెందిన డాక్టర్లు, రామగుండం రీజియన్‌కు చెందిన సింగరేణి అధికారుల మధ్య క్రికెట్ పోటీలు జరిగాయి. సింగరేణి జట్టు 11 పరుగుల తేడాతో డాక్టర్స్ జట్టుపై విజయం సాధించింది. సింగరేణి బౌలర్లలో వంశీ, సురేష్ చెరో రెండు వికెట్లు తీశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ప్రకాశ్ ఎంపికయ్యారు. మ్యాచ్‌లో డాక్టర్ అసోసియేషన్ సభ్యులు దుర్గా ప్రసాద్, సత్యం బాబు, శ్రీనివాసరెడ్డి, విజేందర్‌రెడ్డి, ఆసిఫ్, డీఎంఈ వంశీ, డా.అజయ్, కళాశాల పీడీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం

పెద్దపల్లి, ఏప్రిల్13: కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పెద్దపల్లికి చెందిన మాడూరి వినోద్ కుమార్ ఎన్నికయ్యారు. వినోద్ కుమార్ ప్యానల్ వరుసగా మూడు సార్లు గెలుపొంది హ్యాట్రిక్ సాధించింది. ఆదివారం స్థానిక సిరి పంక్షన్ హాల్‌లో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పోస్టులకు ఎన్నికలు నిర్వహించారు. జిల్లాలో 552 ఓటర్లు ఉండగా, 514 ఓట్లు పోల్ కాగా, అధ్యక్షుడిగా ఎం వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా కంజంపురం రాజేందర్, కోశాధికారిగా పోలు సతీశ్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. దీంతో వినోద్‌కుమార్ ప్యానల్ హ్యాట్రిక్ విజయం సాధించటం పట్ల పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి రాజేందర్

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణరావు

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్13: కాల్వశ్రీరాంపూర్, పెగడపల్లి, మడిపల్లి, మడిపల్లి కాలనీ, ఆశన్నపల్లె, అంకంపల్లిలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంటవిజయరమణారావు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చదువు రాంచంద్రారెడ్డి, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, పీఏసీఎస్, ఏఎంసీ డైరెక్టర్లు, అధికారులు, పాల్గొన్నారు.

బీమా చెక్కు పంపిణీ

ఊషన్నపల్లెకు చెందిన పెండ్లి సంపత్ గత సంవత్సరం కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. మృతుడి భార్య అనసూయకు రూ.లక్ష ప్రమాద బీమా చెక్కును ఎమ్మెల్యే అందించారు. సంపత్ కాల్వశ్రీరాంపూర్ సహకార సంఘంలో క్రాప్ లోన్ తీసుకొని బీమా చేయించుకున్నాడు. కరెంట్ షాక్‌కు గురై చనిపోవడంతో పీఏసీఎస్ ద్వారా బీమా డబ్బులు మంజూరయ్యాయి.

ధర్మారం: ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఆత్మీయ సమ్మేళనం

ధర్మారం, ఏప్రిల్13: నంది మేడారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి చదివిన విద్యార్థులు 1994-1995 బ్యాచ్ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ చదివిన బడి పరిసరాలను చూసి భాగోద్వేగానికి గురయ్యారు. తమకు పాఠాలు చెప్పిన గురువులు పాపిరెడ్డి, నర్సింగంతో పాటు పలువురు గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కరాటే మాస్టర్‌కు సన్మానం

జ్యోతినగర్, ఏప్రిల్ 13: ఇటీవల సికింద్రాబాద్‌లో జరిగిన కరాటే బెల్ట్ పరీక్షలో దేశవ్యాప్తంగా కరాటే బ్లాక్‌బెల్ట్‌కు చెందిన పదిమంది పోటీలో పాల్గొన్నారు., ఎనిమిది మంది ఎంపిక అయ్యారు. ఇందులో గోదావరిఖనికి చెందిన కరాటే మాస్టర్ మొండయ్య 7వ డాన్ నుంచి 8వ డాన్ సాధించారు. ఎన్టీపీసీ విశ్వభారతి పాఠశాల యాజమాన్యం ఆయనను సన్మానించింది. పట్టణంలోని నవోదయ హైస్కూల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమం లో పా ఠశాల యాజమాన్యం సత్కరించింది. ఇక్కడ విశ్వ భారతి విద్యాసంస్థల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్, హెచ్ఎం తిరుపతిగౌడ్, ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, ఇన్‌చార్జి మధూకర్, తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

కోల్‌సిటీ, ఏప్రిల్ 13: అంబేద్కర్ నగర్‌లోఆదివారం రిటైర్డు ఉద్యోగులు, వృద్ధులకు కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి వైద్యులచే నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంకు విశేష స్పందన లభించింది. శిబిరంలో సుమారు 120 మందికి ఉచితంగా బీపీ, షుగర్, 2డీ ఏకో, ఈసీజీ తదితర వైద్య పరీక్షలు చేశారు. ఆస్పత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్, వారి కుటుంబ సభ్యులకు ఉచిత సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరం నిర్వహించినట్లు తెలిపారు.శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన బూడిద హర్ష, ధనాల దుర్గ, వెంకటేశం, రాహుల్, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, బొంగోని హరీష్, యూనస్ పాల్గొన్నారు.

కార్మికులకు అభినందనలు

గోదావరిఖని, ఏప్రిల్ 13: సీఐటీయూ సింగరేణి ఆర్జీ-1 పరిధిలో ఈ నెల 10,11, 12 తేదిలలో జీడీకే 1,3ఇంక్లైన్, 2,2ఏ ఇంక్లైన్, ఎన్‌పీ 5, ఎస్అండ్‌పీసీ, 11ఇంక్లైన్‌లో చెపట్టిన సామాజిక సంఘీభావ ఉద్యమ నిధికి కార్మికులు అందజేసిన విరాళాల పట్ల యూనియన్ ఆర్జీ-1 కార్యదర్శి మెండె శ్రీనివాస్ కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్జీ-1లో మొత్తం రూ.21,170 ఉద్యమనిధిని వసూలు చేసినట్లు తెలిపారు. ఇక్కడ ఆర్జీ-1 అధ్యక్షుడు ఆరెపల్లి రాజమౌళి, ఉపాధ్యాక్షుడు ఆసరి మహేశ్, ఎస్‌కె గౌస్, పిట్ కార్యదర్శిలు దాసరి సురేశ్, అన్నబోయిన శంకరన్న, వంగల శివరాంరెడ్డి, తదితరులు ఉన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

మంథని, ఏప్రిల్ 13: అగ్నిమాపక వారోత్సవాలను అగ్నిమాపక అధికారులు మంథనిలో ఆదివారం ప్రారంభించారు. సురక్షిత భారతాన్ని నిర్మిద్దాం.. అనే నినాదంతో కూడిన వారోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమాతో కలిసి అధికారులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ శివ శంకర వరప్రసాద్, లీడింగ్ ఫైర్‌మెన్ దేవేందర్, ఫైర్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బీపీ మండల్ వర్ధంతి

మంథని: నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ధర్మారం: నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మంథని, ఏప్రిల్ 13: ఓబీసీ సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలని పోరాటం చేసిన మహనీయులు బిందేశ్వర్ ప్రసాద్ మండల్ వర్ధంతి కార్యక్రమాన్ని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆదేశాల మేరకు బీపీ మండల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తగరం శంకర్‌లాల్, యాకుబ్, ఆరెపల్లి కుమార్, ఆకుల రాజబాబు, బెల్లంకొండ ప్రకాశ్‌రెడ్డి, మంథని లక్ష్మణ్, కనవేన శ్రీనివాస్, వేముల లక్ష్మయ్య, కొవ్వూరి శ్రీకర్, ఆసీఫ్‌లతో పాటు పాల్గొన్నారు.

ధర్మారం, ఏప్రిల్ 13 : మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బిందేశ్వర్ ప్రసాద్ మండల్ (బీపీ మండల్) వర్ధంతినిని బహుజన నాయకులు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ మండల్ చిత్రపటానికి బీసీ, ఎస్సీ కుల సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల నాగరాజు, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మూల మల్లేశం గౌడ్, ఆవుల శ్రీనివాస్, బీసీ ఆజాద్ ఫెడరేషన్ ధర్మపురి నియోజకవర్గ అధ్యక్షుడు ముదం శ్రావణ్‌కుమార్, ఐరిపెల్లి శ్రీనివాస్, నాయిబ్రాహ్మణ మండల అధ్యక్షుడు తమ్మడవేని అంజి, ఆవుల కుమారస్వామి, కొమ్మ లచ్చయ్య, సంకరి నర్సింగం, మల్లేశం, సిరికొండ రవి, దాసరి స్వామి, మాజీ ఉప సర్పంచ్ మల్లేశ్ పాల్గొన్నారు.

కళాశాలలో ప్రభుత్వ పథకాలపై వర్క్‌షాప్

ఫర్టిలైజర్‌సిటీ, ఏప్రిల్ 13: గోదావరిఖని ప్రభుత్వ పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మహనీయుల జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తెలంగాణ సమాజాభివృద్ధిపై సమగ్ర విధానాలు, పథకాల అంశాలపై వర్క్‌షాప్ జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ రమాకాంత్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రభుత్వ పథకాల అమలను వివరించారు. పథకాలపై పోస్టర్ ప్రజంటేషన్ జరిగింది. ఇక్కడ అధ్యాపకులు సురేశ్ కుమార్, రమేశ్‌రెడ్డి, రవి, అజయ్‌కుమార్, యాదయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వై ప్రసాద్, విద్యార్థులు ఉన్నారు

ఇద్దరు ట్రాక్టర్ దొంగల అరెస్టు

మంథని రూరల్, ఏప్రిల్ 13: పుట్టపాకలో ట్రాక్టర్ దొంగతనం చేసిన కేసులో ఇదే గ్రామానికి చెందిన ముప్పడి రమేశ్ ఆలియాస్ రవి, గంగాపురి గ్రామానికి చెందిన దాకమూరి ప్రసాద్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రమేశ్ ఆదివారం తెలిపారు. రమేశ్ ఆర్థిక ఇబ్బందుల్లో ఉండగా, వాటిని తీర్చుకోవడానికి ట్రాక్టర్ చేశాడు. మెకానిక్ ప్రసాద్ ద్వారా అమ్ముకోవటానికి ప్రయత్నించగాపట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను, సామగ్రిని స్వాధీన పరుచుకొని, వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్‌ను, పట్టుకున్న నిందితులను సీఐ రాజు అరెస్టు చూపించారు.

కారు, ట్రాక్టర్ ఢీ: ఒకరు మృతి

రామగిరి, ఏప్రిల్ 13: కల్వచర్ల శివారులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వేముల వాడ నుంచి కాటారం మండలం సూరారం వైపునకు కారు (టీఎస్19హెచ్-7488) కల్వచర్ల సమీపంలోని సవేరా ప్లాట్స్ దగ్గర పెద్దపల్లి వైపు వె